కథానిక

# అపనమ్మకం ఖరీదు

ఆర్. యం. చిదంబరం

జీవితంలో ప్రతిమానవుడు ఏదో ఒక నమ్మిక కలిగుంటాడు. అది సందర్భశుద్ధిగా ఉండనివ్వండి, పూర్తిగాఅసందర్భంగా ఉండనివ్వండి. పాపకాండలు 'జోరుగా జరిపేవారికి భక్తిమీద నమ్మకం ఎక్కువ. ఆ రకం యెటువంటి గోసాయిదగ్గరకైనా (ఏదో మహిముందని) పరుగెడతారు. ఒక విషయాన్ని తప్పని ఖండించి హఠాత్తుగా దానినే నమ్ముతారు. ఈ చిత్రప్రవృత్తులకు కారణం పలువిధాల ఊహించవచ్చు. జ్యోతిషంమీద నమ్మకం ఉన్నవాడిని చూచి, "పిచ్చివాడు-పురాతనకాలం మనిషి" అంటాం. కాని జ్యోతిషం నిజమవుతున్న సందర్భాలను చూచి నోరుతెరచి ఆశ్చర్యపడే దృశ్యాలూ ఉండవచ్చు.

జ్యోతిషం అంటే నాకు అరికాలిమంట నెత్తికెక్కుతుంది. నా జీవితంలో కదల్చటానికి వీలులేని ఒక మైలురాయిని అది స్థాపించిపోయింది. కన్నీరు కాల్వలైపారేట్టు చేసింది. అయినా నా వెర్రికాని దానిని నిందించటమెందుకు? "ఎవరి కర్మ వారిది" ఈమాటలు అంటున్నందుకు నాకే ఆశ్చర్యంగా ఉంది. కర్మ అనేది వట్టి బూటకమని వాదించిన వాణ్ణి కనుక—

ఎన్నేళ్ళ క్రిందటనో -ఎప్పుడో- ఈ వాతావరణంలో ఇవన్నీ అప్రస్తుతం- నా హృదయానికి చేరువలో మసలినవాడు గోపాలం. అతని చిరునవ్వు నాకు మరపురాని మెరపు. అయితే క్షణంలో అంతరించే మెరపుకాదు. దాని వెనకాల ఏదో నగ్నసత్యం దాగి ఉంది. ఆ విషయం నేను గుర్తించగలను. వీధిలో జ్యోతిషం చెబుతామనే గోసాయీలను, సోదమ్మో సోది అనే వారిని చూస్తుంటేనూ - కొండవాళ్ళను చూస్తుంటేనూ - చెట్టుకింద "హస్తసాముద్రికము చెప్పబడును. ఒక్క బేడ మాత్రమే"అని బోర్డు తగిలించుకుని కూర్చున్న వాళ్ళను చూస్తుంటేనూ- ఏవేవో తలపులు హృదయంలో పొడుచుకువచ్చి గుండె జల్లుమనేది. కాని ఇందాకటి మెరపు దానిని హరించేది.

గోపాలం కాలేజీలో బి. ఏ. చదువుతుండేవాడు, మంచి తెలివికలవాడని పేరొందాడు. అన్నిరంగాల్లోనూ దుమికి అఖండవిజయం సాధించాడు. అతని విజ్ఞానాన్ని, అనుభవాన్ని చూస్తూవుంటే ఒకవైపుఆనందం, మరొకవైపు అసూయ కలిగేది. కాని అసూయను హద్దు దాటనీయకుండా ఆనకట్టవేసి ఆపాను. కొంతకాలానికి ఆ మెరపు నది నీరంతా హరించివేసింది.

గోపాలం తండ్రి శంకరంగారు నాకెప్పుడూ కనిపిస్తారు. ఆయన్ని తలుచుకుంటుంటే కొంతకాలం క్రిందట నవ్వు వచ్చేది. కానిప్పుడు ఆయనేదో మహాసముద్రాన్నీ దినవాడిలా కనిపిస్తాడు. ఆయన చాలామంచివాడు. ఏఅలంకారానికీ చెందని ఈ మాటేబాగుంది. అయితే ప్రతిమనిషిలోనూ ఉన్నట్టు ఆయనలో కూడా వింతగుణముంది. జ్యోతిషమంటే చెవికోసుకుంటాడు. దానిలో ఆయనకెంతయినా నమ్మకముంది, తను బ్రతికున్నానని నమ్మటమేనా మానేస్తాడుకాని దానిని మాత్రం నమ్మటం మానడు. ఆ కారణంగా జ్యోతిషం చెప్పగలమనేవారికల్లా ఆ యిల్లు సత్రమయింది. అతిథులకు ఏలోటూలేకుండా కాలక్షేపం సునాయసంగా జరిగేది.

గోపాలం అంటూండేవాడు. కాలేజీనుండి రాగానే తండ్రి ఏజ్యోతిష్కుడిముందో కూర్చుని ఏదో మాట్లాడుతూండేవాడు. ఎప్పుడూ గోపాలం జాతకం ఆయనచేతిలోనేఉండేది. జోతిష్కుడు చెప్పే ప్రతిమాటను చెవులు నిక్కబొడుచుకుని వినేవాడు. అతను వెళ్ళిపోయాక గోపాలం "ఆ కాషాయగుడ్డల వెధవ ఏమన్నాడు?" అనడిగేవాడు. అప్పుడు ఒకవైపు కొంటెనవ్వు మరొకవైపు తండ్రిచర్యలపట్ల జుగుప్స కనిపించేది.

"నువ్వు యీ యేడాది ఫస్టుక్లాసులో పేసౌతావట. మన యింటికి లక్ష్మి ఘల్లుఘల్లుమని

వస్తోందట. అనకూడదుకాని నీ జాతకం ఆణి ముత్యం లాంటిది" అని శంకరంగారు జవాబిచ్చేవారు. గోపాలం పకాలున నవ్వేవాడు.

"ఇదంతా నీ వెర్రినమ్మకం నాన్నా! ఈ చవటలంతా నోటికివచ్చినట్లు వాగుతారు. నువ్వు నమ్ముతున్నావు. ఇదంతా పచ్చిమోసం. ఏదో నాలుగుడబ్బులు గుంజటానికి వేస్తున్న ఎత్తు. ఎందుకిలాగ డబ్బంతా పాడుచేస్తున్నావు ఈ దిక్కుమాలిన జ్యోతిష్యమెందుకు నీకు?" అని గోపాలం సీరియస్‌గా అడిగితే,

ఆయన చిరునవ్వునవ్వేవాడు. "నువ్వింకా కుర్రాడివి. లోకానుభవం తక్కువ. నీకన్నీ అలాగే కనిపిస్తాయి. కాని పోనుపోను అర్థంచేసుకుంటావు" అనేవాడు. గోపాలం తండ్రితో ఇలాగ ఎన్నిసార్లు వాదించాడో లెక్కలేదు. కాని శంకరంగారి చర్చకు తిరుగులేకపోయింది.

"ఇదేదో సైకాలజిస్టుకు కూడా బోధపడని విషయం" అన్నాడు గోపాలం నాతో; నిజమేననుకుంటాను.

"ఏమండీ! బి. ఏ. అయిన తరువాత మీవాడి నేంచదివిస్తారు?" అనడిగాను శంకరంగారినొక నాడు.

"ఏమో! వాడిరాత ఎలాగుందో ఎవడు చూచాడు!" అన్నాడాయన.

నేను నవ్వాను. "రాతేమిటండి రాత! రాతా లేదు-గీతాలేదు. మనం అనుకుంటే అన్నీ జరుగుతాయి. ఇప్పుడు ఈ సైన్సుయుగంలో కూడా ఈ పిచ్చినమ్మకాలేమిటి? మీదంతా చాదస్తం. గోపాలాన్ని ఎం. ఏ. స్టాటిస్టిక్స్ చదివించండి" అన్నాను.

"నువ్వింకాకుర్రాడివి, లోకానుభవంతక్కువ. నీకన్నీ అలాగేకనిపిస్తాయి. కాని పోనుపోను అర్థం చేసుకుంటా"వని ఆయన అనేసరికి నా నోరు ఆటోమేటిక్‌గా మూతపడిపోయింది. నవ్వాలో ఏడవాలో అర్థమయిందికాదు.

ఎదురుగాలి వీస్తోందిగదాయని రైలుబండి పరుగెత్తటంమానుతోందా? రైలుపట్టాల మధ్య ఎడం ఎక్కడకొలిచినా సమానంగానేఉంది. అలాగే జీవితాలుకూడా. చిత్రసీమలు సృష్టిస్తూ, హతమారుస్తూ ప్రాకిపోతున్నాయి. ఎండాకాలంలో ఎండకాస్తోంది. వానాకాలంలో వానకురుస్తుంది.

ఆకాశంలో మెరుపు మెరుస్తోంది. కారుమబ్బులు అలుముకుంటున్నాయి. చీకటి వ్యాపిస్తోంది. కాని మెరపు మధ్యమధ్య మెరుస్తోంది. గోపాలం వచ్చాడు. వాడిరాక నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఏరా! ఇంతరాత్రి వచ్చావే?" అన్నాను.

"ఇవేళ చాలా చిత్రమైన సంఘటన జరిగిందిరా" అని ప్రారంభించాడు.

"ఏమిటది?" అన్నాను.

"ఇవేళ సాయంత్రం ఓ జ్యోతిష్కుడు వచ్చాడు".

"ఎప్పుడూ ఉన్న పాటేగా"

"పూర్తిగా విను. అందరికిమల్లే అతను ఏదో చెప్పిరాసి ఇచ్చాడు. అతను వెళ్ళిపోయాక మామూలుగా మానాన్నను వాడేంచెప్పాడని అడిగాను. ఎందుకో ఆయన ముఖం వాడిపోయింది. కాని లేనినవ్వు తెచ్చుకుని "నువ్వు ఫస్టుక్లాసులో పేసౌతావన్నాడ"ని అన్నారు. అసలు రహస్యం ఏదో ఉంది. వాడు రాసిచ్చిన కాగితం ఇమ్మన్నాను. కాని నాన్న ఇవ్వలేదు. అప్పటినుండి ఆయన ముఖంలో కళలేదంటే నమ్ము. ఇది నేను పరోక్షంగా గమనిస్తున్నా" అన్నాడు నాకేమీ అంతు చిక్కలేదు. "మీనాన్నకిదొక వేలంవెర్రై పోయింది. అదిచూచి నువ్వు భయపడుతున్నావు. అసలే నీది సున్నితహృదయం. ఇట్టే వాడిపోతావు. మొత్తానికి నువ్వూ జ్యోతిషాన్ని నమ్ముతున్నావన్నమాట" అన్నాను హేళనగా.

"ఛీ...ఛీ...నా జన్మలో నమ్మను. కాని నాన్నను చూస్తుంటే నాకొకరకమైన భయం కలుగుతోంది. అంతకంటె మరేంలేదు. ఒకసంగతి చెప్పమంటావా?" అని ఆగాడు.

"ఏమిటది?"

"నాన్న ఈవెధవ నమ్మకాలు వదిలేలా కనిపించదు. చెప్పిచెప్పి నానోరు పడిపోతోందికాని ఆయనకు చీమకుట్టినట్టుకూడాలేదు. అందుచేత ఆయనకి పిచ్చివదిలేలాగ ఒక ప్లాన్ వేశాను"

"అదికూడా చెప్పు"

"నేను ఫస్టుక్లాసులో పేసౌతానని అందరు జ్యోతిష్కులూ చెప్పారు. నాన్న నమ్మాడుకూడా. ఈసారి నేను ఎగ్జామినేషన్‌కే వెళ్ళకుండాఉంటే వాళ్ళమాటలెలాగ నిజమవుతాయి?

నాన్న బోలెడంత డబ్బు తగలేస్తున్నారు. ఆయనకు ఇలాగ మానసిక పరివర్తన తీసుకురావాలని నా ఐడియా. ఏమంటావు?"

"నేనేమీ అనుకోని పరీక్షలు పాడుచేసుకుంటున్నావు. అయినా ఎక్కడకు పోతావు?"

"ఏదో ఊరుపోతాను. ఒకవారమేగా"

"రెండు వారాలు"

"పోనీ, నెలఅనుకో—పోయేముందు ఏ ఊరికి పోతానో ముందు నీకు చెబుతాను." నేను సరే నన్నట్టుగా తలవూపాను.

చినుకులుపడటం ప్రారంభించాయి. క్రమంగా వాన ఎక్కువై భోరునకొట్టింది. కిటికీ తలుపులు దడదడ కొట్టుకుంటున్నాయి. బయటంతా చీకటి. మహా భయంకరంగా ఉంది. మధ్యమధ్య మెరుపు మెరుస్తుంటే తలలు విరియబోసుకుని ప్రళయ నాట్యంచేస్తున్న చెట్లు కనిపిస్తుంటే ఏదో భయం కలిగింది. దభాలున కిటికీ తలుపులు మూసేశాను. గోపాలం ఇక యింటికిపోయే ఉద్దేశానికి స్వస్తి చెప్పి ఇక్కడే పడకవేశాడు.

ఎప్పుడు నిద్రపోయామో మాకే తెలియదు. ఎవరో తలుపు దబదబ బాదుతున్న చప్పుడువిని లేచాము. తలుపు తీసేసరికి వానజల్లు కొట్టింది. వచ్చిన వ్యక్తిని చూడగానే ఆశ్చర్యమేసింది. శంకరంగారు టార్చిలైట్‌తో వచ్చారు.

"లోపలికి రండి. ఇంత వర్షంలో వచ్చారేం?" అనడిగాను.

"గోపాలం ఇంటికి రాలేదు. ఇక్కడున్నాడేమోనని చూడడానికి వచ్చాను. అంతకంటే మరేంలేదు నీకోసం చాలాసేపు చూశా నా. గోపాలం! ఎంతకీ కనిపించకపోతే వచ్చాను. ఇంటికి వస్తావా?" అన్నారు.

"ఈ వర్షంలో ఎందుకులెండి. మీరుకూడా వెళ్ళొద్దు. వర్షంలో తడిసి ముద్దయిపోతారు. ఇంత పెద్దవాన ఈ గొడుగేమాపుచేస్తుంది?" అన్నాను.

"మరేం ఫరవాలేదు. వస్తాను" అనేసి చర చర వెళ్ళిపోయాడు.

ఆయన ప్రవర్తన చాలా వింతగా ఉంది. గోపాలం నేనూ సినిమాకు వెళ్ళివచ్చినప్పుడు తన యిల్లు దూరమని గోపాలం ఇక్కడే పడుకునే వాడు. కాని ఎవరూ అతన్ని వెతుక్కుంటూ రాలేదు. మంచమెక్కగానే మొద్దునిద్రపోయే నాకు ఆనాడు నిద్రపట్టనేలేదు. అదొక కాళ రాత్రి. భవిష్యత్తును గురించొక భయం ఆ రాత్రంతా పీడించింది. కాని కళ్ళెం తెగిన గుర్రాలకొక పోకడేమిటి?

అనుకున్నట్టుగానే గోపాల సరిగ్గా పరీక్షల సమయానికి మాయమయ్యాడు. శంకరంగారనుభవించిన దుఃఖానికంతలేదు. కాని గోపాలం నా మీద కూడా కొంత భారంవేశాడు. ఒకనాడు శంకరంగారింటికి వెళ్ళాను. ఆయన అరుగుమీదనే ఉన్నాడు.

"మీవాడు కనిపించాడాండీ?"అని ఉపక్రమించాను.

"లేదు"అన్నాడాయన నిట్టూరుస్తూ.

"చూశారా! ఫస్టుక్లాసులో పేసౌతాడని నమ్మి మోసపోయారు. ఇప్పటికైనా జ్యోతిషం మీది నమ్మకం వదులుకోండి."

"ఏమీ మోసంజరగలేదు. ఇదంతా నాకు ముందే తెలుసు"అని లోపలకువెళ్ళి ఓ కాగితం తెచ్చారు. "దీనిమీదేముందో చదువు"అన్నారు.

నేను చదివాను:

"ఈ జాతకంకలవ్యక్తి త్వరలోనే ఇల్లువిడిచి పారిపోతాడు. మరి తిరిగిరాడు. అదేపోవటం"

"కాని ఈ రహస్యం పైకిపొక్కనివ్వకుండా ప్రయత్నించాను. వాడు కనిపించకపోతే అందు కోసమే అంతవర్షాన్ని లెక్కచేయకుండా పరుగెత్తుకువచ్చాను... కాని ఏమీ లాభంలేదు. చెయ్యి దాటిపోయింది"అనాయన దుఃఖం ఆపుకోలేక ఇంట్లో వెళ్ళిపోయారు.

కాయకష్టం అగౌరవమైనదనే వాదనను నేను మొదటినుంచీ ఖండిస్తున్నాను. ఎందువల్లనంటే అటువంటి మనస్తత్వం నిరుపయోగమైనది. రానురాను కాయకష్టం ఎక్కువ గౌరవప్రదమైన వృత్తిగా పరిగణించబడుతున్నది. కాయకష్టాన్ని హీనంగాచూచే ఏదేశమూ అభివృద్ధి చెందజాలదు.—నెహ్రూ